సాక్షి మంచిర్యాల
ఆదివారం। 25। మే। 2025



సాహిత్యంలో 'అరుణ' కిరణం!

ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ (భీంస)రికి చెందిన ఉపాధ్యాయురాలు అరుణ బట్టువార్ ప్రాథమిక స్థాయి విద్యార్థులను బాల కవులు, సాహిత్యవేత్తలుగా తీర్చిదిద్దేందుకు విశేష కృషి చేస్తున్నారు. హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్‌లో సత్కారం పొందనున్నారు. 8లో▸



బాక్సింగ్ చాంపియన్లుగా నిలవాలి

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు మంచిర్యాలలో శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈనెల 26 వరకు పోటీలు జరుగుతాయి. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
33.3 /26.6

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా తక్కువగా నమోదవుతాయి. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ

- అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాల అగ్రికల్చర్: ఆహార భద్రత కార్డుల జారీ, పాత కార్డుల్లో సభ్యులను చేర్చడానికి వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని అదనపు కలెక్టర్ మోతి లాల్ శనివారం సూచించారు. అర్హులనే ఎంపిక చేయాలని పేర్కొన్నారు. రెండు నెలలుగా 4,797 కొత్త కార్డులు మంజూరు చేశామని తెలిపారు. కొత్తగా చేరికల కోసం 35,178 దరఖాస్తులు విచారణ జరిపి ఆమోదించడం జరిగిందని వెల్లడించారు. రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 160 మంది గైర్హాజరు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు శనివారం 160 మంది గైర్హాజరయ్యారు. ప్రథమ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 2,781 మందికి 2,661 మంది హాజరయ్యారు. 120 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్‌లో 125 మందికి 122 మంది హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 746 మందికి 713 మంది హాజరుకాగా 33 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్‌లో 79 మందికి 75 మంది హాజరుకాగా నలుగురు గైర్హాజరైనట్లు డీఐఈవో అంజయ్య తెలిపారు.

26 నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలోని శ్రీ ఉషోదయ ఉన్నత పాఠశాలలో ఈ నెల 26న ఉదయం 10 గంటల నుంచి మొదటి బ్యాచ్ కోసం ఎంపిక చేసిన లైసెన్స్‌డ్ సర్వేయర్ల అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా సర్వే, భూరికార్డుల ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఎస్సెస్సీ, విద్యార్హత, కమ్యూనిటీ సర్టిఫికెట్లు ఒరిజినల్, జిరాక్స్ పత్రాలతో రావాలని సూచించారు. సివిల్ సర్జన్ జారీ చేసిన శారీర దృఢత్వ సర్టిఫికెట్ సమర్పించాలని తెలిపారు.

ఎకరాకు రూ.30 లక్షలు ఇవ్వాలి

- ఆర్డీవో శ్రీనివాస్‌రావుకు ఓసీపీ నిర్వాసితుల వినతి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

జైపూర్: ఇందారం ఓపెన్‌కాస్టు డంపింగ్ యార్డు కోసం సేకరించిన 129 ఎకరాల భూములకు మార్కెట్ రేటుకు అనుగుణంగా రూ.30 లక్షల పరిహారం ఇవ్వాలని నిర్వాసిత రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్డీవో శ్రీనివాస్‌రావుకు రామారావుపేట, ఇందారం రైతులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఓపెన్‌కాస్టు డంపింగ్‌యార్డు కోసం రామారావుపేట శివారులో 129 ఎకరాలు సేకరించారని, పరిహారం నిర్ణయించకుండా సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందని తెలిపారు. రాజీవ్ రహదారికి సమీపంగా ఉన్న విలువైన భూములు సింగరేణి యాజమాన్యం తీసుకుంటుందని, ప్రస్తుతం ఎకరాకు రూ.కోటి ఉందని పేర్కొన్నారు. యాజమాన్యం రైతులకు సరైన పరిహారం చెల్లించేలా చూడాలని కోరారు. లేదంటే తమ భూములు తమకు ఇవ్వాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నిర్వాసితులు జిట్ట దేవయ్య, నామాల తిరుపతి, యాదగిరి, సరిత, అక్షత్, సాగర్, సత్తయ్య, వేణుగోపాల్, వెంకటేశ్, జీవన్, మధుకర్ తదితరులు ఉన్నారు.

ఏరియాలో పర్యటించిన కార్పొరేట్ జీఎం



జీఎంను సన్మానిస్తున్న ఏరియా అధికారులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో సింగరేణి కార్పొరేట్ జీఎం(ఐ అండ్ పీఎం) మధుసూదన్ శనివారం పర్యటించారు. జీఎం కార్యాలయం ఆవరణలో అధికారులతో కలిసి ఉత్పత్తి ఉత్పాదకతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్య సాధనలో రక్షణ పాటిస్తూ బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌ను ఏరియా జీఎం దేవేందర్‌తో పాటు అధికారులు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం విజయ్ ప్రసాద్, ఇంజనీర్ వెంకటరమణ, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్ తదితరులు ఉన్నారు.

అన్నదాతపై అకాల భారం!



ఈ రైతుపేరు ఆసంపల్లి శంకర్. సారంగపల్లికి చెందిన శంకర్ యాసంగి ధాన్యం ఇరవై రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి తరలించాడు. తూకంలో జాప్యం, అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం ఉండిపోయింది. మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు కేంద్రం మొత్తం బురదమయమైంది. దీంతో ధాన్యం తరలించే లారీలు రావడం లేదు. చేసేది లేక మూడు ట్రాక్టర్ లోడ్‌ల ధాన్యం రోడ్డుపైకి తీసుకెళ్లాడు. ఇందుకు రూ.900 చెల్లించాడు. కూలీలను అడిగితే మరో రూ.900 అడిగారు. దీంతో కుటుంబ సభ్యులే ట్రాక్టర్‌లో ధాన్యం లోడ్ చేసి తరలించారు. అకాల వర్షాలతో ఇలా లారీలోడింగ్ కూలి, ట్రాక్టర్ కిరాయి మీద పడుతుందని ఆవేదన వ్యక్తం చేశాడు.

జిల్లాలో ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం

ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు	345
ధాన్యం సేకరించిన కేంద్రాలు	321
మూతపడ్డ కేంద్రాలు	118

ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం 1,50,738.880 మెట్రిక్ టన్నులు
మొత్తం రైతులు 20,973 మంది



మందమర్రి మండలం సారంగపల్లిలో బురదలో నుంచి ధాన్యం మరోచోటకు తరలిస్తున్న రైతులు



బూజు పట్టిన ధాన్యం చూపుతున్న రైతు కనకయ్య



కొనుగోలు కేంద్రం నుంచి తరలిస్తున్న రైతులు

- జిల్లాలో మూడు రోజులుగా వాన
- కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో తడుస్తున్న ధాన్యం..
- కుప్పలు, కవర్లు మార్చడానికి అదనపు ఖర్చు..

మంచిర్యాలఅగ్రికల్చర్: అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో మూడు రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు జిల్లా వ్యాప్తంగా 23.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. కాసిపేట, దండేపల్లి, హాజీపూర్, తాండూర్, మందమర్రి మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలు, ఆరబోసిన ధాన్యం వర్షంలో తడిసి రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యం మొలకెత్తడం, బూజు పట్టడంతో నష్టం వాటిల్లుతోంది. తడిసిన ధాన్యం చూసి రైతులు కంటతడి పెడుతున్నారు. ఒకటి కాదు రెండు కాదు నాలుగైదు కవర్లు, ఫెక్సీలు ధాన్యం కింద, మీద కప్పినా వరద ధాన్యం కుప్పలోకి చేరుతుంది. కాలువలు తీసి కాపాడుకునేందుకు అరిగోస పడుతున్నారు.

ధాన్యం తరలింపుతో ఆర్థిక భారం

వర్షం కారణంగా కొనుగోలు కేంద్రాలు బురదమయమవడంతో లారీలు లోపలికి వెళ్లలేక రోడ్లపై నిలిపివేస్తున్నారు. రైతులు ట్రాక్టర్ల ద్వారా ధాన్యాన్ని రోడ్లపైకి తరలిస్తున్నారు. ఒక ట్రాక్టర్ లోడింగ్‌కు కూలీలు, కిరాయితో కలిపి రూ.600 ఖర్చవుతోంది. టర్పాలిన్ కవర్ల కిరాయి మరో భారంగా మారుతోంది. ధాన్యాన్ని ఒకచోట నుంచి మరోచోటికి మార్చడం, కవర్లు కప్పడం వంటి పనులతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ధాన్యం సేకరణలో అడ్డంకులు

జిల్లాలో 1,50,738.880 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. దీంతో 75 శాతం సేకరణ పూర్తయింది. జన్నారం, దండేపల్లి, హాజీపూర్ వంటి మండలాల్లో 90 శాతం సేకరణ పూర్తయింది. వేమనపల్లి, కోటపల్లి వంటి ప్రాంతాల్లో ఆలస్యంగా దిగుబడి వచ్చిన ధాన్యం వర్షాల కారణంగా తడుస్తోంది. 108 కొనుగోలు కేంద్రాలను మూసివేశారు.

పరిష్కారానికి చర్యలు

గత నెలలో మిల్లుల వద్ద ధాన్యం తరలింపు ఆలస్యమైనప్పటికీ, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు కేటాయింపుతో సేకరణ వేగవంతమైంది. అయినా అకాల వర్షాలు తూకం, లోడింగ్‌కు అడ్డంకిగా మారుతున్నాయి. రైతులు ధాన్యాన్ని కాపాడుకునేందుకు కాల్వలు తీసి, కవర్లు మార్చి శ్రమిస్తున్నారు.

జిల్లాలో 23.7 మి.మీ వర్ష పాతం..

జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు 23.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాసిపేటలో 56.8 మిల్లీ మీటర్లు, జన్నారంలో 13.5, దండేపల్లిలో 42.6, లక్సెట్టిపేటలో 28.4, హాజీపూర్‌లో 47, తాండూర్‌లో 38.5, భీమినిలో 15.7, కన్నెపెల్లిలో 10, వేమనపల్లిలో 18.9, నెన్నెలలో 11.5, బెల్లంపల్లిలో 18.1, మందమర్రిలో 29.3, మంచిర్యాలలో 26.6, నస్పూర్‌లో 24.5, జైపూర్‌లో 13.3, భీమారంలో 8, చెన్నూర్‌లో 5.2, కోటపల్లిలో 19.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు, రైతులు పడుతున్న ఇబ్బందులు, అధికారులు చేపడుతున్న చర్యల గురించి జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ శ్రీకళను ఫోన్‌లో సంప్రదించగా, ఆమె స్పందించలేదు.

వానలే దెబ్బతీస్తున్నయ్..



ఎకరం పొలంలో ఏటా ట్రాక్టర్ లోడు వడ్లు వచ్చేది. ఈ యేడు రెండు ట్రాక్టర్ల దిగుబడి వచ్చింది. వడ్లను కొనుగోలు కేంద్రానికి తెచ్చి పదిరోజులు దాటింది. మొన్ననే మాయిశ్చర్ వచ్చింది. తూకం వేయడానికి నా సీరియల్ నంబర్ వచ్చేసరికి వానలు మొదలైనయ్. మూడు రోజుల నుంచి వానలతో కవర్లు కప్పుడు, కాలువలు తీసుడే అయితాంది. అయినా వడ్లు తడుస్తున్నయ్. దీంతో నష్టం తప్పేలా లేదు..

– పొట్టాల రామయ్య, చిత్రకుంట

'ఉపాధి'పై విజిలెన్స్

- పనుల్లో పారదర్శకత కోసం పర్యవేక్షణ కమిటీలు
- గ్రామస్థాయిలోనే అక్రమాలకు చెక్..



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పాతమంచిర్యాల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో లక్షల మందికి ఉపాధి కల్పిస్తూ ఆర్థిక బలోపేతం చేస్తోంది. పనులలో పారదర్శకత, నాణ్యతను నిర్ధారించేందుకు 2025 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రతీ గ్రామ పంచాయతీలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేశాయి.

విజిలెన్స్ కమిటీలు..

ఉపాధి పనుల పర్యవేక్షణకు వేసే ఈ కమిటీలను గ్రామసభల ద్వారా ఎంపికైన ఐదుగురు సభ్యులతో ఏర్పాటు చేస్తారు. కమిటీలో మూడింట ఒక వంతు మహిళల భాగస్వామ్యం తప్పనిసరి. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, యువజన సంఘాలు లేదా స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఇందులో ఉంటారు. ఈ కమిటీల కాలపరిమితి ఆరు నెలలు, సభ్యులు స్వచ్ఛందంగా ఎలాంటి వేతనం లేకుండా పనిచేస్తారు. గత నెలలో ఏర్పాటు ప్రారంభమై, మే రెండవ వారంలో జిల్లాలోని 16 మండలాల్లోని గ్రామ పంచాయతీలలో కమిటీలు ఏర్పాటు చేశారు.

కమిటీల విధులు, బాధ్యతలు

ప్రతీవారం గ్రామ పంచాయతీ పరిధిలో జరిగే ఉపాధి పనులను కమిటీలు సమీక్షిస్తాయి. పని స్థలాలను సందర్శించి, కూలీలతో సంప్రదించి, సౌకర్యాలు, నాణ్యత, వేతన చెల్లింపులు, పనుల పరిమాణం వంటి అంశాలను పరిశీలిస్తాయి. నెలవారీ నివేదికలను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు సమర్పిస్తాయి. సమస్యల పరిష్కారానికి అధికారులకు సిఫారసులు చేస్తాయి. సామాజిక తనిఖీలలో కమిటీ నివేదికలను పరిగణనలోకి తీసుకుంటారు.

పారదర్శకతకు కేంద్రం మార్గదర్శకాలు

అవకతవకలను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించింది. విజిలెన్స్ కమిటీలు గ్రామీణ ఉపాధి పథకంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు తెలిపారు.

జిల్లా వివరాలు..

జాబ్‌కార్డులు	1,02,119
కూలీలు	2,37,449
యాక్టివ్ జాబ్‌కార్డులు	77,586
యాక్టివ్ కూలీలు	1,32,245
గ్రామపంచాయతీలు	305

పారదర్శకత పెంచడానికే..



ఉపాధి హామీ పనులలో పారదర్శకత పెంచడానికి విజిలెన్సు మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేశాం. గ్రామపంచాయతీ స్థాయిలో ఏర్పాటైన కమిటీలు గ్రామాభివృద్ధికి అవసరమైన పనుల ఎంపిక, చేపట్టిన పనులు పరిశీలన, పనులలో అవకతవకలు నిరోధించేలా పనిచేస్తాయి.

– ఎస్.కిషన్, డీఆర్డీవో

రైతుల సేంద్రియ బాట

- లోపాలను అధిగమించేలా వినూత్న పద్ధతులు
- పొలాల్లో గొర్రెలు, మేక మందలు..



వ్యవసాయ క్షేత్రాల్లో గొర్రెలు, మేకల మందలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/దండేపల్లి: ఆధునిక వ్యవసాయంలో పెట్టుబడులు విపరీతంగా పెరిగింది. ఇదే సమయంలో భూసారం గణనీయంగా తగ్గుతోంది. ఫలితంగా పంట దిగుబడులు తగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. పాడి పశువుల సంఖ్య తగ్గడంతో సేంద్రీయ ఎరువు లభ్యత తగ్గిన నేపథ్యంలో సేంద్రియ ఎరువులు దొరకడం లేదు. దీంతో రసాయన ఎరువులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఈ క్రమంలో లోపాలు, ఆర్థిక నష్టాలను అధిగమించేందుకు మళ్లీ రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గుచూపుతున్నారు.

గొర్రెలతో వినూత్న ఎరువు సేకరణ

రైతులు గొర్రెలు, మేకలను ఉపయోగించి సేంద్రీయ ఎరువు సమకూర్చుకుంటున్నారు. గతంలో యాదవులకు పంపిణీ చేసిన గొర్రెలను రాత్రిపూట పొలాల్లో మందలు పెడుతున్నారు. ఇందుకు ఎకరాకు రూ.2 వేల నుంచి రూ.2,500 వెచ్చించి సేంద్రీయ ఎరువు సేకరిస్తున్నారు. ఎకరం విస్తీర్ణంలో ఒక రాత్రిలో 800 గొర్రెలు లేదా మేకల మందను ఉంచితే ఏడాదికి సరిపడా ఎరువు, పంటలకు అవసరమైన పోషకాలు లభిస్తాయంటున్నారు.

భూసారం పెంపొందేలా..

గొర్రెల పేడ, మూత్రం, వెంట్రుకల ద్వారా భూమికి నత్రజని (3–13 గ్రాములు/లీటర్ మూత్రం), పొటాషియం (18–20 గ్రాములు), పాస్పరస్ వంటి సేంద్రీయ పదార్థాలు అందుతాయి. గొర్రె పేడలోని పీచు పదార్థం మొక్కల వేర్లు సులభంగా ఎదిగేలా చేస్తుందని దండేపల్లి ఏఈవో మానిక తెలిపారు. ఒక రాత్రి విసర్జించే లీటరు మూత్రం భూమిలో తేమను నిలుపుతుంది. ఒక్కసారి ఎరువు కోసం పెట్టుబడి పెడితే మూడేళ్ల వరకు ఎరువు అవసరం లేదని రైతులు చెబుతున్నారు.

సారవంతమైన భవిష్యత్తు

గొర్రెల ద్వారా నత్రజని, భాస్వరం, పొటాష్‌తో పాటు ఉపయోగకరమైన సూక్ష్మజీవులు భూమికి అందుతున్నాయి. ఈ వినూత్న పద్ధతితో తక్కువ ఖర్చుతో భూసారం పెరిగి, రైతులు సేంద్రీయ వ్యవసాయంలో లాభాలు ఆర్జిస్తున్నారు.

అటవీ అనుమతులకు ప్రత్యేక చర్యలు

- గిరిజనుల అభివృద్ధికి కృషి
- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



వీసీలో మాట్లాడుతున్న కొండా సురేఖ, సీతక్క

మంచిర్యాలఅగ్రికల్చర్: అభివృద్ధి పనులకు అవసరమైన అటవీ అనుమతుల జారీకి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సువర్ణ, పర్యావరణ, అటవీ, శాస్త్రసాంకేతిక శాఖ కార్యదర్శి అహ్మద్ నదీంతో, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అటవీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొండా సురేఖ మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి అనుమతులు మంజూరు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, తాగునీటి సరఫరా, విద్యుత్, పాఠశాలలు, ఆస్పత్రులు ఇతర అభివృద్ధి పనుల కోసం సమర్పించిన ప్రతిపాదనలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పంచాయతీరాజ్, రోడ్లు భవనాల పరిధిలో చేపట్టే రహదారుల పనులకు అటవీ శాఖ అధికారులు సహకరించాలని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని మానవతా దృక్పథంతో అటవీ నిబంధనలకు లోబడి అనుమతులు జారీ చేయాలన్నారు. అవసరమైతే అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణలో పనులు జరిగేలా చూడాలని తెలిపారు. పనుల పురోగతిపై ఈనెల 28లోగా నివేదిక ఇవ్వాలని సూచించారు.

అభివృద్ధిలో వెనుకబాటు..

ప్రస్తుతం సమాజంతో పోలిస్తే అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులు అభివృద్ధిలో వెనకబడ్డారని మంత్రి సీతక్క అన్నారు. ఆదివాసీల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రహదారుల నిర్మాణం, విస్తరణ, జాతీయ రహదారులకు అనుసంధానం ద్వారా మారుమూల గిరిజనులకు, బాహ్య ప్రపంచానికి సంబంధాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

పోడు వ్యవసాయానికి తోడ్పాటు..

జిల్లాలోని పోడు భూములలో వెదురు మొక్కల పెంపకంపై గిరిజనలకు అవగాహన కల్పించి సాగు చేసేలా తోడ్పాటు అందిస్తున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నర్సరీలలో వెదురు మొక్కలు పెంచుతున్నామని జిల్లాలో కొన్నేళ్లుగా పట్టుపురుగలు పెంచుతున్నట్లు వెల్లడించారు. మట్టి రోడ్లను సీసీ, బీటీ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జీపీవో పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

- సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్



వీసీలో కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: గ్రామ పాలన అధికారులకు ఆదివారం రాత పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ సూచించారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ కలెక్టర్, అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. లోటుపాట్లకు, అవకతవకలకు తావులేకుండా, ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగే విధంగా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ పరీక్షకు జిల్లాల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో జవాబు పత్రాల తరలింపు, స్ట్రాంగ్ రూమ్, పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు, పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు తెలుసుకునేలా అధికారులను ఆదేశించామన్నారు. వీసీలో ఆర్డీవో శ్రీనివాస్‌రావు, కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్, మంచిర్యాల తహసీల్దార్ రఫతుల్లా, విద్యాశాఖ పరిశీలకులు సత్యనారాయణ, ముఖ్య పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎగతాళి చేశాడని ఫిర్యాదు

మందమర్రిరూరల్: మండలంలోని నార్లాపూర్‌కు చెందిన పెద్దపల్లి సత్యనారాయణ గ్రామానికి చెందిన గోపతి శ్రీనివాస్ తనను కుంటోడు అని తన వైకల్యాన్ని ఎగతాళి చేశాడని పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామానికి చెంది బీరయ్యతో తాను ఫోన్‌లో మాట్లాడుతుండగా అదే సమయంలో శ్రీనివాస్ బీరయ్యకు ఫోన్ చేశాడు. ఆ కాల్‌ను కాన్ఫరెన్స్‌లోకి తీసుకున్నాడు. ఈ సందర్భంగా శ్రీనివాస్ దివ్యాంగుడిని అయిత తనను కించపరిచేలా మాట్లాడాడని తెలిపాడు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించాడు.



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

ఎంసీహెచ్‌లో సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలటౌన్: మాతా శిశు ఆస్పత్రికి వచ్చే గర్భిణులు, బాలింతలకు సమస్యలు ఎదురుకాకుండా చూడాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు వైద్యులకు సూచించారు. ఎంసీహెచ్‌ను శనివారం సందర్శించి వైద్యులు, గర్భిణులతో మాట్లాడారు. ఏ సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్రారెడ్డి, ఆర్ఎంవోలు భీష్మ, శ్రీధర్, కార్పొరేషన్ కమిషనర్ శివాజీ ఉన్నారు.

పనులు వేగవంతం చేయాలి

లక్సెట్టిపేట: పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు సూచించారు. నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. నాణ్యతతో పనులు చేయాలన్నారు. వర్షాకాలం సమీపిస్తున్నందున పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. అనంతరం ఐదు రోజులుగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో యాదయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ.ఆరీఫ్, నాయకులు శ్రీనివాస్, చింత అశోక్, నాగభూషణం, పింగిళి రమేశ్, స్వామి, సురేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ



కోటపల్లి: మండలంలోని రొయ్యపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ జరిగింది. శనివారం ఉదయం కేంద్రం తలుపులు పగులకొట్టి ఉండటంతో స్థానికులు నిర్వాహకురాలు విజయలక్ష్మికి సమాచారం అందించారు. ఆమె అక్కడికి వచ్చి చూడగా కేంద్రంలో 17 పాల ప్యాకెట్లు, 10 పప్పు ప్యాకెట్లు, 5 ట్రేల కోడిగుడ్లను గుర్తుతెలియని దుండుగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కాలేజీరోడ్‌లో..

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్‌లో ఈనెల 22న చోరీ జరిగినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కాలేజీరోడ్‌కు చెందిన ముక్తా ప్రసాద్ జైపూర్ మండలం ఇందారంలో రేషన్ షాపులో పనిచేసేవాడు. ప్రసాద్ ప్రతీ రోజు ఉదయం ఇందారం వెళ్లి సాయంత్రం వచ్చేవాడు. ఈనెల 21న ప్రసాద్ భార్య ఇంటికి తాళం వేసి బయటకు వెళ్తూ పక్కనే ఉన్న చందా ప్రసన్నలక్ష్మికి తాళం చెవి ఇచ్చింది. ఈనెల 22న ఉదయం ఇంట్లో బీరువాలో 120 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. సుమారు వీటి విలువ రూ.7.20 లక్షలు ఉంటుందన్నారు. ప్రసన్నలక్ష్మి, మరో వ్యక్తిపై అనుమానం ఉందని బాధితుడు ప్రసాద్ ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సైకిల్‌ను ఢీకొట్టిన ఆటో



రాజన్న (ఫైల్)

జన్నారం: సైకిల్‌ను ఆటో ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతిచెందాడు. జన్నారం పోలీస్‌ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై రాజవర్ధన్ కథనం ప్రకారం.. మండలంలోని అక్కపెల్లిగూడకు చెందిన గోలి రాజన్న (55) పాత ఇనుప సామాను దుకాణంలో పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి పని ముగించుకుని సైకిల్‌పై ఇంటికి వస్తున్నాడు. జన్నారం వైపు వస్తున్న ఆటో వెనుకవైపు నుంచి సైకిల్‌ను ఢీకొట్టడంతో రాజన్నకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని అతన్ని జన్నారంలో ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం లక్సెట్టిపేట ఆసుపత్రికి పంపించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన ఆటో బాదవత్ జనంత్‌రావుకు చెందినదిగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య కళావతి ఫిర్యాదుతో శనివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉండగా పెళ్లయింది.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

బెజ్జూర్: మండలంలోని కుశ్నపల్లి సమీపంలో శుక్రవారం సాయంత్రం గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పక్కా సమాచారంతో వాహనాలు తనిఖీ చేపట్టినట్లు పేర్కొన్నారు. సులుగుపల్లికి చెందిన మాజీ ఉప సర్పంచ్ సిడాం సంతోష్ బైక్‌పై తరలిస్తున్న రూ.3,86,970 విలువ చేసే 3.47 కిలో గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సాహిత్యంలో 'అరుణ' కిరణం!

- ఆకట్టుకుంటున్న బట్టువార్ బాల సాహిత్యం..
- విద్యార్థుల్లో సాహిత్య బీజాలు నాటుతున్న ఉపాధ్యాయురాలు..
- తాను రచిస్తూ.. పిల్లల్లో సాహిత్యం పెంపొందించేలా ప్రేరణ..
- ఐదు భాషల్లో మధుర గేయాల పుస్తకాలు ముద్రణ
- సొంతంగా 1,937 కవితలు రాసిన టీచర్..
- నేడు 'తెలంగాణ సారస్వత పరిషత్' ఆధ్వర్యంలో సన్మానం



తెలుగులో గేయం రాసిన మన్నూర్ పాఠశాల విద్యార్థులు(ఫైల్)



ముద్రించిన బాలగేయాల పుస్తకాలతో అరుణ

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా భీంసరికి చెందిన ఉపాధ్యాయురాలు అరుణ బట్టువార్ ప్రాథమిక స్థాయి విద్యార్థులను బాల కవులు, సాహిత్యవేత్తలుగా తీర్చిదిద్దేందుకు విశేష కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ఇంద్రవెల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న ఆమె.. బాలల్లో సాహిత్య ఆసక్తిని పెంపొందిస్తున్నారు. ఆమె స్వయంగా 1,937 కవితలు రాసి, 10 సాహిత్య పుస్తకాలను ప్రచురించారు. విద్యార్థుల ద్వారా ఐదు భాషల్లో ఆరు బాల గేయ పుస్తకాలను ముద్రించారు. ఆమె సేవలను గుర్తించి, 'తెలంగాణ సారస్వత పరిషత్' 82వ స్థాపన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో ఆదివారం జరిగే బాల సాహిత్య సమ్మేళనంలో సన్మానించనుంది.

సాహిత్య సేవలకు గుర్తింపు

అరుణ బట్టువార్ 1997లో ఎంఏ, బీఎడ్ పూర్తి చేసి ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. కథలు, నాటికలు రాసి రేడియో ప్రోగ్రామ్‌ల ద్వారా ప్రసారం చేశారు. ఆమెకు విశ్వవిఖ్యాత గౌతమి నంది, ఎస్వీఆర్ డిజిటల్ అండ్ గౌతమేశ్వర కామధేను, ప్రైడ్ ఇండియా, కలం భూషణ్, సాహితీ కిరణం, గుడిహత్నూర్ బెస్ట్ టీచర్, సావిత్రిబాయి పూలే, చతుర్ముఖ సింహ, కథరత్న, మధుర కవయిత్రి వంటి అనేక అవార్డులు లభించాయి. తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, విశ్వవిఖ్యాత కీర్తి, తెలుగు వెలుగు జాతీయ సాహిత్య పురస్కారాలు, ఆర్ఎస్ఎన్ సేవ ఫౌండేషన్ కవితా పురస్కారాలు కూడా ఆమె సొంతం చేసుకున్నారు.

ఐదు భాషల్లో బాల గేయాలు

అరుణ బట్టువార్ పనిచేసిన పాఠశాలల్లో విద్యార్థులతో కవితలు, సాహిత్య రచనలు చేయించారు. 2021–24 మధ్య గుడిహత్నూర్ మండలం మన్నూర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ, విద్యార్థులతో తెలుగు, హిందీ, మరాఠీ, ఇంగ్లిష్ భాషల్లో గేయాలు రాయించారు. వాటిని 'మన్నూర్ బాలల మధుర గేయాలు', 'మన్నూర్ చిల్డ్రన్స్ మెలోడీయస్ రైమ్స్' వంటి పుస్తకాలను ముద్రించారు. 2013లో సీతారాంగూడ పాఠశాలలో గొండి భాషలో 'చుడూర్ కాండీరా... చుడూర్ పాటింగ్'గేయాల పుస్తకాన్ని రాయించారు. ఇంద్రవెల్లిలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులతో అలంకార కవితలు రాయించి పుస్తకం ముద్రించారు.

సాహిత్య బీజం నాటి..

అరుణ బట్టువార్ సాహిత్య ప్రతిభను విద్యార్థుల్లో నాటడం ద్వారా బాల సాహిత్యానికి కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. ఆమె కృషిని జిల్లా వాసులు, తోటి ఉపాధ్యాయులు ప్రశంసిస్తున్నారు. ఆమె బోధన, సాహిత్య రచనలు భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి.

సంతోషించారు



గొండి భాషకు లిపి లేదు. మాతో గొండి భాషలో బాలగేయాలు రాయించాలని టీచర్ కృషి చేశారు. తెలుగులో చెబుతుంటే మేము గొండి భాషలో రాశాం. మా తప్పులు సరిచేస్తూ మళ్లీ రాయిస్తూ చక్కటి బాలగేయ పుస్తకాలను టీచర్‌తో కలిసి సమాజానికి అందించాం. మేం రాసిన పుస్తకం చదివి మా గ్రామస్తులు సంతోషించారు

– కినక గణేశ్, సీతారాంగూడ విద్యార్థి

బాల కవులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

పిల్లల్లో సాహిత్యాన్ని పెంపొందిస్తాం. చక్కని కథలు, గేయాలు, వచన కవితలు రాసేటట్టు తర్ఫీదునిస్తాం. పిల్లలను బాల కవులుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యం. సాహితీ పుస్తకాలు చదవడం, రాయడంతో నైపుణ్యం పెరుగుతుంది.

– అరుణ బట్టువార్, ఇంద్రవెల్లి జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయురాలు

టీచర్ కృషితోనే..



తెలుగులో అలంకారాలు నేర్చుకోవడంలో టీచర్ సులువు పద్ధతి చెప్పేవారు. ఉదాహరణలు ఇస్తూ వాటి ద్వారా కవితలు రాయిస్తే గుర్తుంటాయని మాతో కవితలు రాయించేది. మొదట్లో కొంత తికమకపడ్డాం. మేడం సలహాలతో 20 మంది పదో తరగతి విద్యార్థులు వివిధ అలంకార కవితలు రాశాం. ఇలా రాయడంలో టీచర్ కృషి ఉంది.

– చంద్రకాంత్, మన్నూర్ పాఠశాల విద్యార్థి

పట్టు సాధించాం



టీచర్‌తోనే సాహిత్యం, బాలగేయం పరిచయమైంది. ఆమె ప్రోత్సాహంతో బాలగేయాలు రాసేవాళ్లం. అందులో తప్పులు సరిచేస్తూ మళ్లీ రాయించేది. ఇలా రాయడం ద్వారా సాహిత్యం, బాల గేయాలపై పట్టు సాధించగలిగాం. ఆంగ్ల బాలగేయ పుస్తకాన్ని ముద్రించగలిగాం. టీచర్ కృషితో ఇది సాధ్యమైంది.

– పెందోర్ లక్ష్మి, మన్నూర్ విద్యార్థిని

ఎస్టీపీపీలో వర్క్స్ కమిటీ సమావేశం నిర్వహించాలి



రియాజ్ అహ్మద్

జైపూర్: ఎస్టీపీపీలో వర్క్స్ కమిటీ సమావేశం నిర్వహించాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2016–20 వరకు స్టీగ్ కంపెనీ నుంచి కార్మికులకు ఫుల్‌అండ్ ఫైనల్ సెటిల్మెంట్ ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. ఒక్కో కార్మికుడికి రూ.70వేలకు పైగా వస్తాయని, ఆ డబ్బులు సింగరేణి యాజమాన్యం కాజేసిందా అని ప్రశ్నించారు. పవర్‌మేక్ కంపెనీ సబ్ కాంట్రాక్టు వీవీఆర్ అనే కంపెనీ 2016–23 వరకు కార్మికులకు ఫుల్‌అండ్ ఫైనల్ సెటిల్మెంట్ చేయలేదన్నారు. కంపెనీ నిబంధనలు ప్రకారం బోనస్ 8.33 ఇవ్వాలని అలా చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. పవర్‌మేక్ కంపెనీ వెంటనే డబ్బులు చెల్లించాలని లేకపోతే కార్మికులు ఆందోళన చేపడుతారని హెచ్చరించారు.

పులిని హతమార్చిన 30 మంది అరెస్టు

కాగజ్‌నగర్‌టౌన్: పెంచికల్‌పేట మండలంలోని ఎల్లూరు అటవీప్రాంతంలో విద్యుత్ తీగల ఉచ్చుతో పులిని హతమార్చిన 30 మందిని శనివారం అరెస్టు చేసినట్లు కాగజ్‌నగర్ ఫారెస్టు డివిజన్ అధికారి సుశాంత్ సుఖ్‌దేవ్ బోబాడే తెలిపారు. అప్పాజి శ్రీనివాస్, వెంకటేశ్,ఎల్కరి శేఖర్, రోహిని శ్రావణ్, చప్పిడె అశోక్, పవన్‌కుమార్,ఎల్కరి ప్రకాశ్, వెంకటేశ్, కాటెల సాగర్, నికాడి వెంకటేశ్, లా త్కరి శ్రీనివాస్, భీంకరి వెంకటేశ్, భీంకరి రంగయ్య, లేగల గోపాల్, రాచకొండ లచ్చయ్య, ఓంద్రె సంతోశ్, తుమ్మిడె శ్రీనివాస్, ఎల్కరి సుగుణాకర్, బుర్రి తిరుపతి, ఓంద్రె నారాయణ, లేగల వెంకటేశ్, గోమాసు రాజన్న, మడె మధునయ్య, లేగల సత్యనారాయణ, ఎల్లూరి లచ్చన్న, మౌల్కార్ దివాకర్, బిన్కర్ తిరుపతి, తుమిడె సత్తయ్య, పెద్దల నీలయ్య, గావుడె శంకర్ ఉన్నారన్నారు. సిర్పూర్(టి) సివిల్‌కోర్టులో హాజరుపర్చామని, 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించగా, ఆసిఫాబాద్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

బాక్సింగ్ చాంపియన్లుగా నిలవాలి



బాక్సింగ్ పోటీల్లో గెలుపొందిన వారిని ప్రకటిస్తున్న నిర్వాహకులు



మాట్లాడుతున్న డీవైఎస్‌వో కీర్తి రాజ్‌వీర్

మంచిర్యాలటౌన్: బాక్సింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులు చాంపియన్లుగా నిలిచి, జాతీయస్థాయిలోనూ రాణించాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కీర్తిరాజ్‌వీర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ పర్యవేక్షణలో టైసన్ కప్–2025 చాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలను శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఈనెల 26వ తేదీ వరకు నిర్వహించనున్న బాక్సింగ్ పోటీలకు రాష్ట్రస్థాయి నుంచి 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ పురుషోత్తం నాయక్, నిర్వాహకుడు చిలువేరు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పశువులు మృతి



లక్ష్మణచాంద: గేదె కళేబరం



దిలావర్‌పూర్:ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎద్దు కళేబరం



కడెం: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆవు..

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లితండాలో విద్యుత్ షాక్‌తో గేదె మృతిచెందింది. గేదె ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం మేతకు వెళ్లి ంది. తిరిగి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో రైతు బానావత్ రాంజీ చుట్టుపక్కల వెతి కాడు. శనివారం అటు వైపుగా వెళ్లిన గ్రామస్తులకు గేదె మృతి చెంది కనిపించడంతో రైతుకు సమాచారమిచ్చారు. మేత మేసేక్రమంలో వి ద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు గుర్తించా రు. దీని విలువ రూ.55 వేలు ఉంటుందని ప్ర భుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

దిలావర్‌పూర్‌లో..

దిలావర్‌పూర్: మండల కేంద్రానికి చెందిన రైతు నంద ముత్యం ఎద్దు శనివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఎప్పటిలాగే తన పంటచేలకు ఎడ్లబండితో వెళ్లి అక్కడ వ్యవసాయ పనులు చేస్తున్నాడు. మేతకోసం ఎద్దులను పొలంలో ఉంచగా ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. అక్కడ 11 కేవీ విద్యుత్ తీగలకు ఎద్దు తోక తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు కిందపడిపోగానే అక్కడకు చేరుకున్న రైతు ఏం జరిగిందో తెలియక వేలాడుతున్న విద్యుత్ తీగను చూసి భయాందోళనకు గురయ్యాడు. వెంటనే విద్యుత్ సరఫరా నిలుపుదల చేయాలని అధికారులకు సమాచారమిచ్చారు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.80 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

కడెంలో..

కడెం: మండలంలోని అల్లంపల్లి జీపీ పరిధి పాలరేగడి గ్రామ గిరిజన రైతు పెంద్రం మధుకు చెందిన ఆవు విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. దత్తోజీపేట సమీపంలో శుక్రవారం ఆవు మేతకు వెళ్లి సాయంత్రం ఇంటికి వస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగలకు తగిలి షాక్‌తో మృతిచెందింది. దీని విలువ రూ.40 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

20 క్వింటాళ్ల నకిలీ పత్తివిత్తనాలు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నకిలీ పత్తి విత్తనాలు

కాగజ్‌నగర్‌రూరల్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.60 లక్షల విలువైన 20 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కాగజ్‌నగర్ రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఎస్పీ డీవీ.శ్రీనివాస్‌రావు శనివారం వివరాలు వెల్లడించారు. నకిలీ విత్తనాలు సరఫరా అవుతున్నాయని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందడంతో కాగజ్‌నగర్ సమీపంలోని పెద్దవాగు సమీపంలో తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో అటుగా వచ్చిన ఏపీ39 టీవై 9741 నంబర్ ఐచర్ వ్యాన్‌ను తనిఖీ చేయగా అందులో 20 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు ఉన్నట్లు గుర్తించారు. విత్తనాలకు సంబంధించిన వివరాలు తెలుపకపోవడంతో కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడకు చెందిన కొత్తపల్లి సదాశివ్, కర్నూల్ జిల్లా అదోనికి చెందిన డ్రైవర్ పుప్పాల లక్ష్మణ్, మహారాష్ట్రలోని అహేరికి చెందిన సంతోష్‌కిశోర్‌ను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. మరో నిందితుడు వేణుగోపాల్‌రెడ్డి పరారీలో ఉన్నారని తెలిపారు. జిల్లాలో ఎవరైనా నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, కాగజ్‌నగర్‌రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు, టాస్క్‌ఫోర్స్ ఎస్సై వెంకటేశ్, రూరల్ ఎస్సై సందీప్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మన్నూర్, ఇస్లాంనగర్ గ్రామాల్లో ఆదిలాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆధ్వర్యంలో శనివారం నకిలీ విత్తనాలు పట్టుకున్నట్లు తెలిసింది. ఉదయం 8 గంటలకు ఏకకాలంలో దాడులు నిర్వహించి నకిలీ బీజీ–3 విత్తనాలను పట్టుకున్నట్లు సమాచారం. ఈ దాడుల్లో 18 నకిలీ విత్తనాల బ్యాగులతో పాటు ముగ్గురిని అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై స్థానిక ఎస్సై పురుషోత్తం వివరణ కోరగా ఆకస్మికంగా దాడులు జరిపిన మాట వాస్తవమన్నారు. విచారణ కొనసాగుతుందని పేర్కొన్నారు.

నడుమునొప్పి భరించలేక ఆత్మహత్య



గరికే లక్ష్మణ్ మృతదేహం

తానూరు: నడుమునొప్పి భరించలేక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై భానుప్రసాద్ కథనం ప్రకారం.. మండలంలోని వడ్ఝరి(బి) గ్రామానికి చెందిన గరికే లక్ష్మణ్ (29) రెండేళ్లుగా నడుమునొప్పితో బాధపడుతున్నాడు. గతేడాది శస్త్రచికిత్స చేయించుకున్నా నయం కాలేదు. ఆ తర్వాత వ్యవసాయ పనులు చేస్తుండగా కట్ల పాము కాటేసింది. కాళ్లవాపు తగ్గలేదు. వైద్య పరీక్షలు నిర్వహించుకోగా వ్యాధి నయం కాలేదు. అటు నడుమునొప్పి, ఇటు కాళ్లవాపు తగ్గకపోవడం తీవ్ర మనస్తాపంతో శుక్రవారం సాయంత్రం వ్యవసాయ పొలానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. రాత్రయినా లక్ష్మణ్ ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి బాలాజీ వెతుకుంటూ వ్యవసాయ పొలానికి వెళ్లాడు. అక్కడ స్పృహకోల్పోయిన లక్ష్మణ్‌ను భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. భార్య నాగమణి ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

కుళ్లిన చికెన్, పాడైన గుడ్లు



అన్నంలో వచ్చిన బొద్దింక



కుళ్లిన చికెన్

- దాబాలో నాసిరకం ఆహార పదార్థాలు
- తాజాగా అన్నంలో బొద్దింక ప్రత్యక్షం

బోథ్: సొనాల మండలంలోని ఓ పెట్రోల్ పంపు సమీపంలో గల దాబాలో కుళ్లిన చికెన్, పాడైన గుడ్లు దర్శనమిచ్చాయి. అంతేకాదు దాబాలో తింటున్న ఓ యువకుడి అన్నంలో బొద్దింక వచ్చింది. బోథ్ మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన యువకుడు శనివారం సొనాల మండలం గుట్టపక్క తండా సమీపంలో ఓ పెట్రోల్ పంపు వద్ద ఉన్న దాబాకు వెళ్లాడు. భోజనం చేస్తుండగా అన్నంలో బొద్దింక ప్రత్యక్షంతో కంగుతిన్నాడు. వెంటనే దాబా సిబ్బందిని పిలిచి ఇదేంటని అడిగితే, అనుకోకుండా వచ్చిందని నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేశాడు. యువకుడు పలువురు స్థానికులు, విలేకరులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని తనిఖీ చేయగా బొద్దింక ఉన్న అన్నంతోపాటు, రిఫ్రిజిరేటర్‌లో కుళ్లిన చికెన్ మాంసంతోపాటు పాడైన ఉడకబెట్టిన గుడ్లు కనిపించాయి. అప్పటికే దాబాలో తింటున్న వారు అవాక్కయ్యారు. మధ్యలో భోజనం ఆపివేశారు. భోజనంలో బొద్దింక రావడంపై సదరు సిబ్బందిని అడుగగా నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారని వారు తెలిపారు. అధికారులు వెంటనే దాబాను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికులకు అండగా ఉండాలి



నియామక పత్రాలు అందజేస్తున్న జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్: కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉండాలని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం రాత్రి రసూల్‌పల్లెలోని తన నివాసంలో శ్రీరాంపూర్ డివిజన్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఏ సమస్య వచ్చినా యజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. కార్మికుల చిరకాల వాంఛ అయిన సొంతింటి పథకం అమలు కోసం కృషి చేస్తున్నామన్నారు. అలవెన్స్‌లపై ఆదాయ పన్ను రీయింబర్స్‌మెంట్, రూ.25 లక్షల వడ్డీ లేని రుణం తదితర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎన్నికల వేళ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులకు యూనియన్ పదవులు అప్పగించి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర కమిటీ నాయకులు భీంరావు గరిగే స్వామి, కలవేన శ్యామ్, ఏనుగు రవీందర్‌రెడ్డి, జీవన్‌జోయల్, తిరుపతిరాజు, నాయకులు పేరం రమేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు మధ్యప్రదేశ్‌వాసి మృతి



విష్ణుప్రసాద్ మృతదేహం

తాండూర్: పాముకాటుకు మధ్యప్రదేశ్ వాసి మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వర్కడే విష్ణుప్రసాద్ (52) బతుకుదెరువు కోసం తాండూర్ మండలం రేపల్లెవాడకు వలసవచ్చాడు. ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులో కూలీ పనులు చేస్తూ రేపల్లెవాడలో అద్దెకు ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రించిన విష్ణుప్రసాద్ శనివారం తెల్లారేసరికి పాముకాటుకు గురై మృతి చెంది ఉన్నాడు. స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి సోదరుడు మాన్‌సింగ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాత్కాలికంగా సింగరేణి ప్యాసింజర్ రైలు రద్దు

బెల్లంపల్లి: భద్రాచలం రోడ్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య రాకపోకలు సాగించే సింగరేణి ప్యాసింజర్ రైలు (నెం.17033/17034)ను తాత్కాలికంగా రద్దు చేశారు. మహబూ బాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో నాన్ ఇంటర్ లాకింగ్, రైల్వేట్రాక్ పునరుద్ధరణ పనులు జరుగుతుండటంతో రైలును రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఈమార్గంలో ఎక్క డ నాన్ ఇంటర్ లాకింగ్, రైల్వేట్రాక్ పనులు చేపట్టినా సింగరేణి ప్యాసింజర్ రైలును తాత్కాలికంగా కొన్నిరోజుల పాటు రద్దు చేయడం రైల్వే అధికారులకు పరిపాటిగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. ఈకారణంగా భద్రాద్రి కొత్తగూడెం వెళ్లడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డా యి. ముఖ్యంగా కోల్‌బెల్ట్‌ప్రాంతాల వాసులకు సింగరేణి పరంగా కొత్తగూడెం వెళ్తుంటారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సత్వరంగా సింగరేణి ప్యాసింజర్ రైలును పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.